

# జీవితం

పూ. భా.

పిల్లి చచ్చినా పురిటి వాసన పోదన్నట్టు సూర్యారావుకి ఉద్యోగం పోయినా ఉద్యోగకాలంలో అలవాటైన దురలవాట్లు మాత్రం పోలేదు. అఖండంగా ఐదు సంవత్సరాలపాటు వెలిగించిన చక్కని ఉద్యోగం అమాంతంగా పోయిననాడు నూతిలో గెంతేదామనిపించింది సూర్యారావుకి. ఎంత గౌరవం, ఎంత హోదా, ఎంత పలుకుబడి! అన్నీ ఒక్కసారి మంటకలిసి పోయాయి. కేవలం తన వల్లనే ప్రజలకి అన్నం దొరుకుతోంది అని తనూహించుకున్న స్వర్ణ దినాలు గతించాయి. ఎంతమంది ప్రజలు రేషన్‌కార్డు కోసరం తన యింటిచుట్టూ, ఆఫీసు చుట్టూ తిరిగేవారు! ఎంతమంది వర్తకులూ, వ్యాపారస్తులూ చిత్తంచిత్తంఅనుకుంటూతిరిగేవారు!

నూరు చీవాట్లు ఒక్క బొబ్బట్టుతో సమానం కావు అన్నట్టు తనకి వినీ, వినిపించకుండా ఎంతమంది కారుకూతలు కూస్తే తనకేం, తనకి రావలసిన నాలుగు పైసాలూ ఒచ్చి యింట్లో పడుతూంటే! ఏనుగ వెళుతూంటే వెయ్యి కుక్కలు మొరుగుతాయ్ అనుకునేవాడు.

సూర్యారావు మొదట్లో చాలా బుద్ధిమంతుడు. ఎలాగో కష్టపడి కాస్త చదువుకుని నిరుద్యోగి అయాడు. నిజానికి అతని వినయ సంపత్తిని చూసే ప్రక్కయింటాయన రేషన్ డిపార్టుమెంటులో ఉద్యోగంవేయించాడు. ఒక్క సంవత్సరం ఉద్యోగం చేసే సరికి సూర్యారావులో ఎంతో మార్పు వచ్చింది. ఆ సంవత్సరంలో సూర్యారావు ప్రతి యింటికీ వెళ్లి మనుషుల్ని లెఖ్ఖ వెయ్యడం, కార్డులు వ్రాసి యివ్వడం, రేషన్‌షాపులూ, కాఫీ హోటేళ్లూ తనిఖీ చెయ్యడం, బియ్యంబస్తాలు మంజూరు చెయ్యడం మొదలైన అన్ని ఉద్యోగాలూ చేశాడు. నలుగురుతోనూ పరిచయం అయింది. ఎవరితో ఏవిధంగా మాట్లాడాలో నేర్చుకున్నాడు. తనంతట తాను అడక్కుండానే నాలుగు పైసాలు జేబులో పడే చాకచక్యాన్ని నేర్చుకున్నాడు. "మీయింట్లో తక్కువ మనుషులున్నారే, రేషన్‌కార్డులో ఎక్కువమంది ఉన్నారు, కేసు పెడతా"నని ప్రజల్ని; "బ్లాక్ మార్కెట్ చేస్తున్నట్టు నాకు తెలియక పోలేదు, ఆ లాభంలో వాతు పెట్టకపోతే షాపు నిలవదు" అని వ్యాపారస్తుల్ని బెదరించేసరికి నాలుగు రాళ్లు రావడంలో అభ్యంతర ఏముంది? క్రమేణా సూర్యారావుకి బియ్యం కొనుక్కోవలసిన అవసరం గానీ, కాఫీహోటల్‌కి వెళితే డబ్బు యిచ్చుకోవాలన్న బాధగానీ లేకపోయింది.

రెండు సంవత్సరాలు గడచేసరికి ఊళ్లో పెద్ద మొనగాడైపోయాడు. చిన్నచిన్నవాళ్లని లెఖ్ఖ చెయ్యడం మానేశాడు. హేటూ, బూటూ, సూటూ వేశాడు. అలాంటివాళ్లతోనే తిరుగుతూండేవాడు. కిల్లీ, సిగరెట్టు, పేకాట దగ్గరనుంచి స్పెన్సర్‌కి వెళ్లి బీర్‌బుడ్డీ విప్పేదాకా వచ్చాడు. అయినా భార్యకి నగలూ, నాణాలూ చేయించక పోలేదు. చక్కని మేడ కట్టిద్దామనుకున్నాడుకాని లోకానికి భయపడి ఆ ప్రయత్నంనుంచి విరమించుకున్నాడు. ఇలాంటిపరిస్థితుల్లో అతని ఉద్యోగం కాస్తా ఊడిపోయింది; ఉద్యోగంలేదు. ఉద్యోగకాలంలో సంపాదించుకున్న నాలుగు పైసాలూ పూర్తిగా ఖర్చయాయి. పైనుంచి పైసారాకపోయినా నిత్య జీవితావసరాలు తప్పుతాయా! పైగా వ్యసనాలు. భోజనం లేకపోయినా ఉండగలడుగాని వ్యసనాలు ఊరుకోనిస్తాయా? భార్య నగలన్నీ అమ్మేశాడు.



'మీ నాన్నతో వెళ్లిపో. తిరిగి ఉద్యోగం సంపాదించుకుని నిన్ను తీసుకువస్తాను.'

నూటునూరిపోయి సోడా పంచలుదాకా వచ్చింది. సంసారం గడవడంకష్టంగా ఉంది. మహావ్యాధితో పిచ్చివాడల్లే తయారయాడు.

తన వెనకాల ఏ వ్యాపారస్తులు చిత్తం చిత్తం అనుకుంటూ తిరిగేవారో వారిదగ్గరికివెళ్లి ఏదైనా ఉద్యోగం యిమ్మని ప్రార్థిస్తే వారే ఎంతో హేళనగా మాట్లాడేవారు. ఇప్పుడు సూర్యారావు దగ్గర వాళ్లెందుకు భయపడాలి? అతని పరిస్థితి చూసి సానుభూతి చూపేవాళ్లకన్న నవ్వేవాళ్లే ఎక్కువయారు. 'అయిందిరా అయ్యగారి ఉద్యోగం. ఇప్పుడైనా నెత్తిమీదికళ్లు క్రిందికి దిగుతాయేమో' అని అతని ముఖంఎదుటే అనేవారు.

భార్యని పంపించమని ఎన్నిసార్లు ఉత్తరాలు వ్రాసినా జవాబివ్వని సూర్యారావు, "మీకూతురు మిమ్మల్నందర్నీ చూడాలని ఎంతో ఆతృత పడుతోంది. మీరువచ్చితీసుకు వెళ్లవచ్చు"నని ఉత్తరం వ్రాసేడు మావగారికి.

నాలుగురోజుల్లో మావగారు వచ్చారు. అల్లుడికి ఉద్యోగం పోయిందన్న విషయమే తెలుసు గాని వారి ప్రస్తుత పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉందని సూర్యారావు మావగారికి తెలీదు. ఇల్లు అయ్యవారి నట్టిల్లులా వుంది. కూతురువల్ల మెల్లగా పరిస్థితి తెల్సుకున్నాడు. తెలియనివాళ్లదగ్గర గౌరవ మర్యాదలు పోయినా ఫరవాలేదుగాని, తెలిసిన వాళ్లదగ్గర, అందులోనూ బంధువులదగ్గర-హీనంగా కనుపించడంఎవరికైనా నికృష్టంగానే ఉంటుంది. సూర్యారావుకిప్రాణాలుపోయినంత యిదిగా ఉంది.

సరిగ్గా ఆపూటకే బియ్యం నిండుకున్నాయి. ప్రక్క యిళ్లల్లో అప్పు పుట్టలేదు. సూర్యారావు భార్య కళ్లంట నీళ్లు తిరుగుతున్నాయి; అంత కంట్రోలు రోజుల్లోనూ ఏ క్షణంలో చూసినా బస్తా బియ్యానికి తక్కువ లేకుండా ఉండే ఇంట్లో బియ్యం లేకపోయాయి. అది చూసి సూర్యారావు భరించలేక పోయాడు. ఇక మావగారికి ముఖం చూపించేకన్న చనిపోవడం మేలనుకున్నాడు.

'మీ నాన్నతో వెళ్ళిపో. తిరిగీ ఉద్యోగం సంపాదించుకుని నిన్ను తీసుకుస్తా' నని భార్యతో చెప్పి వెళ్ళిపోయాడు.